సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 18 । మార్చి । 2023



'మార్కెటింగ్'కు మస్తు పైసలు..

జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్లు గతేడాదికి కంటే అధిక రాబడి సాధించాయి. నిర్ణీత లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. IIలో



ఆందోళన ఉద్రిక్తం

పాల్వంచలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన శుక్రవారం ఉద్రిక్తతకు దారి తీసింది. IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 28° / 20°

జిల్లాలో శనివారం కూడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది. చలి గాలులు కూడా వీస్తాయి.

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలంకరణలో భద్రాద్రి రామయ్య



నిత్యకల్యాణంలో స్వామివారి ఉత్సవమూర్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, సాయంత్రం దర్బారు సేవ నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం పంచామృతాలతో అభిషేకం చేశారు. ముందుగా మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

సీతారామ.. ఇదేం ఖర్మ?



నత్తనడకన సాగుతున్న సీతమ్మసాగర్ బ్యారేజీ పనులు

కాళేశ్వరం కంటే ముందే పనులు ప్రారంభం

- ఏడేళ్లలో రూ.6వేల కోట్లకు పైగా వ్యయం
- అయినా ఒక్క ఎకరాకూ నీరందని వైనం
- ఫైనల్ డీపీఆర్ ఖరారులో జాప్యం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పనులు ప్రారంభించి ఏడేళ్లు.. నిర్మాణ పనుల కోసం ఇప్పటి వరకు వెచ్చించింది రూ.6వేల కోట్లకు పైగానే. కానీ నేటికీ కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఇవ్వలేక పోతోంది సీతారామ ప్రాజెక్ట్. గోదావరి నీళ్లు ఎప్పుడు పొలాల్లోకి పారుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

కాళేశ్వరానికి మూడునెలల ముందే..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తర్వాత సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. అందులో భాగంగా 2016 ఫిబ్రవరిలో సీతారామ, మేలో కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. మూడు నెలలు ఆలస్యంగా చేపట్టినా కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వడివడిగా సాగాయి. మూడు బ్యారేజీలు, మూడు పంపుహౌస్‌ల నిర్మాణాలు కేవలం మూడేళ్ల వ్యవధిలోనే పూర్తయ్యాయి. 2019 జూన్ 21న అంగరంగ వైభవంగా ఈ ప్రాజెక్టును సీఎం కేసీఆర్ జాతికి అంకితం చేశారు. మరోవైపు సీతారామ ప్రాజెక్టు పనులు ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు... అన్నట్టుగా సాగుతున్నాయి. నిర్మాణ పనులు ప్రారంభమై ఏడేళ్లు దాటినా ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేని పరిస్థితిలో ఉంది.

డీపీఆర్‌కు ఏడేళ్లు..

సీతారామ ప్రాజెక్టు డిజైన్లు ఖరారు చేయడంలో సాగునీటి శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆపసోపాలు పడింది. ముందుగా ఖరారు చేసిన డీపీఆర్‌లో టేకులపల్లి మండలం రోళ్లపాడు వద్ద భారీ రిజర్వాయర్ నిర్మించాల్సి ఉంది. దీంతో 2016 ఫిబ్రవరి 16న అక్కడే ప్రాజెక్టు పనులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. రెండేళ్లలోనే ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల ప్రజల సాగు, తాగునీటి కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ తర్వాత రిజర్వ్ ఫారెస్ట్, కిన్నెరసాని అభయారణ్యం, రైల్వే ట్రాక్‌లతో ఇబ్బంది ఉండొద్దంటూ రీ డిజైన్ చేస్తూ మరో డీపీఆర్ సిద్ధం చేశారు. దీంతో కీలకం అనుకున్న రోళ్లపాడు రిజర్వాయర్ 'సీతారామ'లో చోటు కోల్పోయింది. ఇలా అనేక సార్లు డీపీఆర్ మారుతూ వచ్చింది. చివరకు ఈ ఏడాది ఫిబ్రవరి 14న నీటి పారుదల శాఖ అధికారులు కేంద్ర జల సంఘానికి ఫైనల్ డీపీఆర్‌ను సమర్పించారు.

సాగుతున్న భూసేకరణ..

సీతారామ ప్రాజెక్టు బ్యారేజీ నిర్మాణం, ఫ్లడ్‌బ్యాంక్‌లు, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు, పంప్‌హౌజ్‌లకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ ఏడేళ్లు దాటినా ఇంకా కొలిక్కి రాలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇంకా 500 ఎకరాలకు పైగా భూమి సేకరించాల్సి ఉండగా, ఖమ్మం జిల్లాలో 1,717 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 888 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. ఇది కాకుండా ఇల్లెందు నియోజకవర్గానికి సంబంధించి మార్చిన డిజైన్ ప్రకారం ఎంత భూమి సేకరించాలనే అంశంపై స్పష్టత లేదు. సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పనులు వేగవంతం చేయాలంటూ భద్రాద్రి, ఖమ్మం జిల్లాల కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఆశించిన మేర పురోగతి లేదు. దీంతో పొలాలకు నీరందించే పంట కాల్వల నిర్మాణ పనులు ఆగుతూ.. సాగుతూ అసంపూర్తిగా ఉన్నాయి.

కాల్వల నిర్మాణంలోనూ జాప్యమే..

రాష్ట్రంలో ఏ సాగునీటి ప్రాజెక్టుకూ లేని అనేక సానుకూల అంశాలు 'సీతారామ'కు ఉన్నాయి. పొలాలకు నీరందించే పంట కాల్వల నిర్మాణం త్వరితగతిన చేపడితే కొత్త బ్యారేజీ నిర్మాణం పూర్తి కాకపోయినా బ్రిటీషర్లు కట్టిన పాత ఆనకట్టలో నిల్వ ఉన్న నీటిని పొలాలకు మళ్లించే వీలు ఉండేది. కానీ బ్యారేజీ నిర్మాణ ప్రదేశం నుంచి సుమారు 70 కిలోమీటర్ల వరకు చుక్క నీరు పొలాలకు వదిలే వీలు లేకుండా కాల్వలు డిజైన్ చేశారు. ఏడేళ్లయినా ఫస్ట్ ఫేస్‌లోని 70 కిలోమీటర్ల కాల్వ నిర్మాణమే నేటికీ పూర్తి కాలేదు. దీంతో గోదావరి నీరు ఎత్తిపోసేందుకు ఏడాది కిందటే అందుబాటులోకి వచ్చిన బీజీ కొత్తూరు, వీకే రామవరం, కమలాపురం పంప్ హౌస్‌లను ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది.

రూ.వేల కోట్లు వెచ్చించినా..

సీతారామ ప్రాజెక్టు ప్రారంభించినప్పుడు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి అంచనా వ్యయం రూ.13,065 కోట్లు. గడిచిన ఏడేళ్ల కాలంలో భూసేకరణ, పంప్‌హౌస్‌లు, పంట కాలువలు, బ్యారేజీ నిర్మాణం తదితర పనులకు సుమారు రూ.6,500 కోట్లు ఖర్చయ్యాయి. కానీ ఇప్పటివరకు ఒక్క ఎకరాకు కూడా నీరందలేదు. పైగా ఏడేళ్ల కాలంలో సవరించిన డీపీఆర్‌లు, హైడల్ విద్యుత్ ప్లాంట్ చేర్పు తదితర కారణాలతో అంచనా వ్యయం రూ.13,065 కోట్ల నుంచి రూ.18,900 కోట్లకు చేరుకుంది.

రేపు పుష్కర తీర్థయాత్ర

- 19న భద్రాద్రికి చేరుకోనున్న సముద్ర, నదీ జలాలు
- నవమి ఏర్పాట్ల పరిశీలనకు నేడు కలెక్టర్ రాక..



పెద్దవరంలో దర్భ సేకరిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఈనెల 22న ప్రారంభం కానున్న వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్సవాల పనులు వేగవంతం అయ్యాయి. ఓ వైపు నవమి ఏర్పాట్లు, మరో వైపు యజ్ఞాలకు సంబంధించిన పనులు చురుకుగా సాగుతున్నాయి. పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం కోసం దేశ నలుమూలల నుంచి సేకరిస్తున్న సముద్ర, నదీ, పుణ్య సరస్సుల జలాలు ఈనెల 19న భద్రాచలం చేరుకోనున్నాయి. ఆదివారం ఉదయం బ్రిడ్జి సెంటర్ వద్ద నున్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం వద్దకు ఈ జలాలు చేరుకోగానే మేళతాళాలు, మంత్రోచ్చరణల నడుమ ఊరేగింపుగా 'పుష్కర తీర్థ యాత్ర'ను ఆలయం వరకు కొనసాగించనున్నారు. ఇక యజ్ఞంతో పాటు ఇతర పూజల కోసం వినియోగించే దర్భ సంగ్రహణ కార్యక్రమాన్ని ఏపీలోని కృష్ణా జిల్లా పెద్దవరం పెరియ పెరుమాళ్ ఆలయానికి చెందిన అర్చకులు శుక్రవారం చేపట్టారు. పూజాది కార్యక్రమాల అనంతరం వీటిని రామాలయానికి చేర్చనున్నారు. మరో వైపున ఆలయ ప్రాంగణంలో 12 రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక హవనానికి అవసరమైన హోమకుండాల నిర్మాణ పనులను రామాలయ విశ్రాంత ప్రధానార్చకులు పొడిచేటి రామ చంద్రాచార్యులు పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు.

అందుబాటులో సురక్షిత తాగునీరు..

ఆలయం, పరిసర ప్రాంతాల్లో భక్తులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య ఇక పరిష్కారం కానుంది. హైదరాబాద్‌కు చెందిన ది వీస్ ల్యాబ్ వారు సురక్షిత తాగునీటి పథకాల(మినరల్ వాటర్ ప్లాంట్) ఏర్పాటుకు రూ.40 లక్షలు అందించగా దేవస్థానం తూర్పుమెట్లు, నిత్యాన్నదాన సత్రం, శ్రీరామ నిలయం, సౌమిత్రి సదనం, పర్ణశాల వద్ద వీటి నిర్మాణం పూర్తయింది. మిథిలా స్టేడియంలో కల్యాణ వేదికకు పంచరంగులు వేసి ముస్తాబు చేశారు. చలువ పందిళ్లు పూర్తి కాగా, విద్యుదీకరణ పనులను శుక్రవారం ప్రారంభించారు. 22వ తేదీన ఉగాది రోజున సీఎం కేసీఆర్, గవర్నర్ తమిళి సైతో పాటు మంత్రులకు, అతిథులకు ఆహ్వాన పత్రికలు అందించనున్నారు. 20వ తేదీన జరిగే సమీక్ష సమావేశం అనంతరం ఈఓ రమాదేవి, ముఖ్య అర్చకులు, వేద పండితులు ఆహ్వాన పత్రాలతో హైదరాబాద్ వెళ్లనున్నారు.

నేడు కలెక్టర్ పర్యటన..

నవమి ఏర్పాట్ల పరిశీలనకు కలెక్టర్ అనుదీప్ శుక్రవారం భద్రాచలం రావాల్సి ఉండగా భారీ వర్షాలతో అది శనివారానికి వాయిదా పడింది. ఇక మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఉత్సవ ఏర్పాట్లపై చర్చిస్తారు.

ఆ లాడ్జీల్లో గదులేమైనట్టు..?

శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేకం వేడుకలకు సెక్టార్ల టికెట్లను ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచగా, తాజాగా వసతి గదుల బుకింగ్ సదుపాయాన్ని కూడా కల్పించారు. ఈ మేరకు www. bhadrachalam online. com వెబ్‌సైట్‌లో సంప్రదించాలని ఆర్డీఓ రత్నకల్యాణి తెలిపారు. కాగా, రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచిన ప్రైవేట్ లాడ్జీల గదులపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులు లేని, ఆలయానికి దూరంగా ఉండే ప్రైవేట్ గదులను అధిక ధరలకు అందుబాటులో ఉంచారని, ఆలయానికి దగ్గరగా ప్రముఖ ప్రైవేట్ లాడ్జీలను ఆన్‌లైన్‌లో ఉంచలేదని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దేవస్థానానికి దగ్గరగా పదుల సంఖ్యలో ఉన్న ప్రముఖ లాడ్జీల్లో గదులన్నీ ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నా రు. రాజకీయ పలుకుబడి, అంతర్గత ఒప్పందాలు, ముడుపులు తీసుకుని ప్రముఖ లాడ్జీ లను ఆన్‌లైన్‌లో పెట్టకుండా, వసతులు, అనుమతి లేని లాడ్జీలను ఉంచారని అంటున్నారు.

భోజనంలో నాణ్యత పాటించాలి

- లక్ష్మీదేవిపల్లి వసతి గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్
- దొడ్డు బియ్యం ఎందుకు పెడుతున్నారంటూ ఆగ్రహం



వసతిగృహంలో బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

పాల్వంచరూరల్: వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే భోజనం విషయంలో నాణ్యత పాటించాలని కలెక్టర్ అనుదీప్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సన్న బియ్యంతో భోజనం పెట్టాల్సి ఉండగా, దొడ్డు బియ్యాన్ని ఎందుకు వినియోగిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. బియ్యం నిల్వలు, స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రికార్డుల ప్రకారం నిల్వలు ఉండాలని, తేడా వస్తే చర్య తప్పదని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ గదిలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. భోజనశాలను తనిఖీ చేసిన కలెక్టర్.. అపరిశుభ్రంగా ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. శుభ్రపర్చిన తర్వాత ఫొటోలు తీసి తనకు పంపించాలని చెప్పారు. అదే కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు పరీక్ష రాస్తుండగా పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రంగాప్రసాద్, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఎంపీఓ బి.నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు రేపు రాత పరీక్ష

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 10 మీ సేవ కేంద్రాలకు దరఖాస్తు చేసుకున్న 146 మంది అభ్యర్థులకు ఆదివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర కళాశాలలో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అశ్వారావుపేట మండలంలో భద్రాచలంరోడ్(అశ్వారావుపేట టౌన్)కు 24 దరఖాస్తులు, నారాయణపురం కాలనీ సెంటర్‌కు 7, ఊట్లపల్లి ప్రధాన రహదారికి 6, కొత్త మామిళ్లవారి సెంటర్‌కు 19, గుండాల మండలంలోని నరసాపురం 11, లింగగూడేనికి 10, టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌కు 25, కుంటల్లకు 9, తావుర్యా తండాకు 2, కరకగూడెం మండలం అనంతారం గ్రామానికి 24, సమత్‌భట్టుపల్లికి 22 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. దరఖాస్తుదారులు గంట ముందుగా పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. హాల్‌టికెట్‌తోపాటు ఆధార్‌కార్డు, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్‌ల్లో ఏదైనా ఒకటి తీసుకురావాలని తెలిపారు.

ముంచెత్తిన వాన

- అకాల వర్షంతో దెబ్బతిన్న మొక్కజొన్న, బొప్పాయి తోటలు
- మామిడి రైతులకూ తప్పని కష్టం
- మరో మూడురోజులూ వానలని వాతావరణ శాఖ ప్రకటన
- ఆందోళన చెందుతున్న రైతులు



బూర్గంపాడులో ధ్వంసమైన బొప్పాయి పంట (ఇన్‌సెట్) మొక్కజొన్నను చూపిస్తున్న రైతు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అకాల వర్షం రైతులను నిండా ముంచింది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం వరకు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షాలు కురవడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మొక్కజొన్న, బొప్పాయి పంటలకు తీరని నష్టం వాటిల్లింది. మామిడి కాయలు సైతం రాలిపోయాయి. జిల్లా వ్యవసాయ అధికారిక గణాంకాల ప్రకారం గుండాల మండలంలో 43 మంది రైతులకు చెందిన 121 ఎకరాల మొక్కజొన్న పంట నేలవాలింది. ఇల్లెందు మండలంలో మొక్కజొన్నతో పాటు మామిడి రైతులకూ నష్టం వాటిల్లింది. చాలాచోట్ల మామిడి పూత నుంచి కాత దశలో ఉండగా, కొన్నిచోట్ల కాత ప్రారంభమైంది. వర్షం, ఈదురు గాలులతో మామిడి పూత రాలిపోయింది. కాయలు కూడా నేలరాలాయి. సీజన్ ప్రారంభంలోనే అకాల వర్షాలు కురవడంతో మామిడి రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలినట్టయింది. ఇక కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడవకుండా రైతులు పడరాని పాట్లు పడాల్సి వచ్చింది.

పదెకరాల్లో బొప్పాయి..

ఉద్యాన శాఖ అధికారిక లెక్కల ప్రకారం బూర్గంపాడు మండలం లక్ష్మీపురం, బూర్గంపాడు గ్రామాల్లో పదెకరాల్లో బొప్పాయి పంట ధ్వంసమైంది. వర్షానికి తోడు ఈదురుగాలులు వీయడంతో చెట్లు విరిగి మోళ్లు మాత్రమే మిగిలాయి. ఉద్యాన శాఖ పదెకరాల్లో నష్టం జరిగినట్టు తేల్చినా.. అనధికారికంగా ఇంకా భారీగా నష్టం వాటిల్లి ఉంటుందని తెలుస్తోంది. ఇక కూరగాయలు, మిర్చి తదితర పంటలకు సైతం భారీ నష్టం వాటిల్లింది.

జిల్లాలో 18.1 మి.మీ. వర్షపాతం

జిల్లాలో 18.1 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. దుమ్ముగూడెం మండలంలో అధికంగా 45.8 మి.మీ. బూర్గంపాడులో 44.4 మి.మీ., భద్రాచలంలో 37.6 మి.మీ, అశ్వాపురంలో 34.8 మి.మీ వర్షపాతం నమోదైంది. చర్ల మండలంలో 1.2 మి.మీ, మణుగూరులో 6.8 మి.మీ, గుండాలలో 27.4 మి.మీ, ఇల్లెందులో 6 మి.మీ, టేకులపల్లిలో 4 మి.మీ, జూలూరుపాడులో 26.6 మి.మీ, చంద్రుగొండలో 20.8 మి.మీ, కొత్తగూడెంలో 18.2 మి.మీ, పాల్వంచలో 8.8 మి.మీ, ములకలపల్లిలో 5.2 మి.మీ, దమ్మపేటలో 15.4 మి.మీ, అశ్వారావుపేట మండలంలో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

నిబంధనలతో శాపం..

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టం లెక్కింపులో ప్రభుత్వ నిబంధనలు రైతులకు శాపంగా పరిణమించాయి. సాగు చేస్తున్న పంటలలో 33 శాతానికి పైగా దెబ్బతింటేనే పంట నష్టంగా పరిగణిస్తారు. అంతకంటే తక్కువ ఉంటే రైతులకు ఎలాంటి పరిహారమూ అందే అవకాశం లేదు. దీంతో తమకు అన్యాయం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు సడలించి నష్టపోయిన పంటలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరుతున్నారు.

నష్టాన్ని అంచనా వేస్తున్నాం



అకాల వర్షాలకు జరిగిన పంటల నష్టాన్ని క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నాం. నష్టపోయిన రైతుల వివరాలు ప్రభుత్వానికి నివేదిక అందించి పరిహారం అందజేస్తాం. రాబోయే మూడు రోజులు కూడా వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించినందున రైతులు అప్రమత్తంగా ఉండాలి.

– కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

పరిహారం అందిస్తాం



ఉద్యాన పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వ నిబంధనలకు లోబడి పరిహారం అందిస్తాం. నష్టాల వివరాలు సేకరిస్తున్నాం. ఇంకా మూడు రోజులు వర్షాలు ఉన్న కారణంగా రైతులు జాగ్రత్తలు పాటించాలి.

– జినుగు మరియన్న, జిల్లా ఉద్యాన అధికారి

సమూలంగా ప్రక్షాళన

- ప్రభుత్వ పాడి పరిశ్రమ అభివృద్ధిపై దృష్టి
- డెయిరీలో సీసీ కెమెరాలు, ఉద్యోగులకు బయోమెట్రిక్
- నెలన్నరలో రూ.22లక్షల బకాయిలు వసూళ్లు



ఖమ్మంలో పాడి పరిశ్రమ శాఖ కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: అవినీతి అక్రమాలకు నిలయంగా మారిన జిల్లా పాడి పరిశ్రమ(విజయ డెయిరీ)ను ప్రక్షాళన చేసేందుకు యంత్రాంగం నడుం బిగించింది. కొన్నేళ్లుగా ఖమ్మం పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య(విజయ డెయిరీ)లో అవినీతి రాజ్యమేలుతుండగా, అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకున్నా, కొత్త వారిని నియమించినా తీరు మారటం లేదు. ఖమ్మం పాడి పరిశ్రమలో అనాదిగా పాలు, పాల పదార్థాలు పక్కదారి పట్టడం తదితర అక్రమాలతో సుమారు రూ.40 లక్షల మేర దుర్వినియోగమైనట్లు గుర్తించారు. దీంతో కొన్నాళ్ల క్రితం డీడీ సత్యనారాయణను మాతృ సంస్థకు బదిలీ చేయడమే కాక మేనేజర్లు భరతలక్ష్మి, నరేష్, ప్లాంట్ ఆపరేటర్ మణి, ల్యాబ్ అసిస్టెంట్ నాగశ్రీని సస్పెండ్ చేశారు. అనంతరం వరంగల్ పశుసంవర్థక శాఖ ఏడీ అసోద కుమారస్వామిని ఖమ్మం విజయ డెయిరీ డీడీగా నియమించారు. ఈమేరకు ఉన్నతాధికారులు ఖమ్మం డెయిరీపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టగా దిద్దుబాటు చర్యలు మొదలయ్యాయి.

ఐదుగురే రెగ్యులర్ ఉద్యోగులు

ఉమ్మడి జిల్లా పాడి పరిశ్రమలో మొత్తం 53 మంది ఉద్యోగులు పనిచేస్తున్నా వీరిలో ఐదుగురే రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. ఇందులోనూ ఒకరు సెలవులో ఉన్నారు. కాగా, ప్లాంట్ పాల నిర్వహణ, రవాణా, వెన్న, పాల పదార్థాల తరలింపును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు డెయిరీ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి పుటేజీతో పాటు సిబ్బంది కదలికలను డీడీ చాంబర్ నుంచే పర్యవేక్షించేలా మానిటర్లు బిగించారు. అలాగే, అదనపు సెక్యూరిటీ గార్డుల నియామకానికి రంగం సిద్ధమైంది. దీనికి తోడు కొందరు ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలతో అటెండర్ మొదలు ఉన్నత స్థాయి అధికారి వరకు హాజరు నమోదు చేసేందుకు శుక్రవారం నుంచి బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.

బకాయిల వసూళ్లు, పాల సేకరణ

పాడి పరిశ్రమలో గతనెల 1వ తేదీ నాటికి రూ.46లక్షల బకాయిలు పేరుకుపోయాయి. నూతన డీడీ నేతృత్వాన బకాయిల్లో రూ.22లక్షలు వసూలు చేయగా.. ఇంకా రూ.24 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. ఇక మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచి 2016–17 సంవత్సరం నాటి బకాయిలు రూ.30 లక్షలు ఉండగా వసూళ్లపై దృష్టి సారించారు. అలాగే, విజయ డెయిరీకి పాల సేకరణ పెంచేందుకు గాను సర్వే కోసం ఆరు బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో సూపర్‌వైజర్, ల్యాబ్ అసిస్టెంట్, డాక్ వర్కర్‌తో పాటు డీడీ కార్యాలయ సిబ్బందిని నియమించగా, వీరు సత్తుపల్లి, కల్లూరు, కామేపల్లి, ఎర్రుపాలెం బల్క్‌మిల్క్ కేంద్రాల పరిధిలోని 16 రూట్లు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు, కొత్తగూడెం బల్క్‌మిల్క్ కేంద్రాల పరిధి ఆరు రూట్లలో సర్వే చేస్తున్నారు. పాల ఉత్పత్తిదారులను కలుస్తూ విజయ డెయిరీకి పాలు పోస్తే కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. దీంతో ప్రస్తుతం 8,172 లీటర్ల పాలు సేకరించగా.. త్వరలోనే మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.

ప్రగతిపథంలో నిలిపేందుకు కృషి

డెయిరీని ప్రగతిపథంలో నిలిపేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. ఉద్యోగులు, పాల ఉత్పత్తిదారుల కృషితో లక్ష్యాలను చేరుకుంటామనే నమ్మకం ఉంది. రాష్ట్ర సంస్థ నిత్యం నిర్దేశించిన లక్ష్యం మేరకు పాల సేకరణపై దృష్టి సారించగా, అక్రమాలకు తావు లేకుండా నిఘా పెంచాం.

– అసోద కుమారస్వామి, డీడీ, విజయ డెయిరీ

'పోడు'కు పామాయిల్ మొక్కలు

- రూ.320 కోట్లతో ఫ్యాక్టరీల నిర్మాణం
- ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి వెల్లడి



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న దృశ్యం

అశ్వారావుపేటరూరల్: పోడు భూములకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నందున ఆ భూముల్లో సాగు చేసేందుకు పామాయిల్ మొక్కలను కూడా అందిస్తామని ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని నారంవారిగూడెం పామాయిల్ నర్సరీ, డివిజనల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పామాయిల్ సాగు పెరుగుతున్న నేపథ్యంలో గెలల క్రషింగ్‌కు ఇబ్బంది లేకుండా రాష్ట్రంలోని సిద్దిపేట, బీచుపల్లిలో వచ్చే ఏడాది రూ.320 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీలు నిర్మిస్తామని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్త సాగుతో గెలల దిగుబడి పెరిగే అవకాశాలు ఉన్నందున అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీ సామర్థ్యాల పెంపునకు రూ.180 కోట్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఆయిల్‌ఫెడ్ పరిధిలోని 8 జిల్లాల్లో 45వేల ఎకరాల సాగు లక్ష్యాన్ని ఈ నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. వచ్చే ఏడాది మరో 40వేల ఎకరాల్లో సాగు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. పామాయిల్ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంటే కేంద్రం మాత్రం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. టన్ను గెలల ధర కనీస మద్దతు రూ.18వేలు ఉండాలని కేంద్రాన్ని కోరినా ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో డివిజనల్ అధికారి ఆకుల బాలకృష్ణ, అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్, ఏఈఓ సిద్దార్థ, నాగబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాపకొల్లు హైస్కూల్‌లో డీఎస్పీ విచారణ



పాఠశాలలో విచారిస్తున్న డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు: పాపకొల్లు ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం కొత్తగూడెం డీఎస్పీ ఎస్‌కే అబ్దుల్ రెహమాన్ విచారణ నిర్వహించారు. ఏడో తరగతి చదువుతున్న విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు ఎస్.రామారావుపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైన విషయం విదితమే. దీంతో డీఎస్పీ పాఠశాలను సందర్శించి ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ శ్రీనాథరాజు శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు, స్థానికులతో మాట్లాడారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని జూలూరుపాడు సీఐ జె వసంతకుమార్‌ను ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థులకు కాసేపు సైన్స్ సబ్జెక్ట్‌ను బోధించారు. ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

'గేట్'లో మైనింగ్ విద్యార్థుల సత్తా

కొత్తగూడెంఅర్బన్: గేట్ ఫలితాల్లో కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ పూనెం చందర్ తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాలలో శుక్రవారం అభినందించారు. సత్యమణిదీప్ 267వ ర్యాంకు, జి.శ్రీరాం 812, వి.శరణ్ 856, ఎం.సందీప్ 882, ఈ.తిరుపతి 1439 ర్యాంకులు సాధించారని వివరించారు.

ఆయుష్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

చుంచుపల్లి: జిల్లాలో ఖాళీగా ఉన్న 11 ఆయుష్ మెడికల్ ఆఫీసర్ల పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు డీఎంహెచ్ఓ జేవీఎల్ శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాను జిల్లా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

భక్తులతో మర్యాదగా వ్యవహరించాలి

భద్రాచలంటౌన్: శ్రీరామనవమి, మహాపట్టాభిషేకం వేడుకలకు భద్రాచలానికి వచ్చే భక్తుల పట్ల ఆటో డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించాలని ఎంవీఐ తిరుపతిరావు అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రామయ్య కల్యాణానికి వచ్చే భక్తుల వద్ద అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ట్రాఫిక్ ఎస్సై ఏవీ రావు, రవి, కామేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రిన్సిపాల్ వేధింపులు

అశ్వారావుపేటరూరల్: ఓ విద్యార్థినిని కొంత కాలంగా వేధిస్తున్న ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు నమోదైన ఘటన అశ్వారావుపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని సూర్య పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలికను ప్రిన్సిపాల్ పోతుల రాంప్రభు అలియాస్ రాంబాబు మూడు నెలలుగా వేధిస్తున్నాడు. ఇటీవల ఇవి మరింత ఎక్కువయ్యాయి. దీంతో భయాందోళనకు గురైన బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపారు.

నామమాత్రంగానే మిర్చి కొనుగోళ్లు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా అంతటా గురువారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తుండడంతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు మందగించాయి. రోజూ 25వేల నుంచి 30వేల బస్తాల వరకు మిర్చి తీసుకొచ్చే రైతులు శుక్రవారం 15,280 బస్తాల మిర్చి మాత్రమే తీసుకొచ్చారు. వర్షం కారణంగా మిర్చిని యార్డుల్లో కాకుండా షెడ్లలో దింపించిన వ్యాపారులు అక్కడే కొనుగోళ్లు చేపట్టారు. మిర్చి క్వింటాకు గురువారం రూ.23వేల ధర పలకగా.. శుక్రవారం కూడా అదే ధర నమోదైంది తాలు మిర్చి ధర మాత్రం రూ.14వేలు నుంచి రూ.14,500కు చేరింది. ఈ సందర్భంగా మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున రైతులు పంటలను రక్షించుకోవడంతో పాటు, వర్షం తగ్గాకే ఖమ్మం మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు.

పసికందు మృతి

పాల్వంచరూరల్: మూర్ఛతో ఐదునెలల పసిపాప మృతిచెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రెడ్డిగూడెం శివారు ఎస్టీకాలనీకి చెందిన మడకం భీమా, లక్ష్మి దంపతులకు చెందిన ఐదునెలల కూతురు ఉన్నది. వారు గురువారం ఏపీ రాష్ట్రంలోని భీమవరం వెళ్లగా అక్కడ మూర్ఛ వ్యాధితో చిన్నారి మృతి చెందింది. మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

'మార్కెటింగ్'కు మస్తు పైసలు..



బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ముఖద్వారం

- లక్ష్యానికి చేరువలో వ్యవసాయ మార్కెట్లు
- పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలపై ఫీజు వసూళ్లు
- ఫిబ్రవరి వరకు రూ.17 కోట్లు దాటిన ఆదాయం

బూర్గంపాడు: వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నిర్దేశిత ఆదాయ లక్ష్యానికి చేరువలో ఉంది. గతేడాదికి కంటే అధికంగా రాబడి సాధించింది. జిల్లాలో ఆరు వ్యవసాయ మార్కెట్లు ఉండగా, ఇప్పటికే కొత్తగూడెం, ఇల్లెందు వ్యవసాయ మార్కెట్లు నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాయి. మిగిలినవి కూడా లక్ష్యానికి దగ్గరగా ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెటింగ్ ఫీజు వసూళ్లు చేసే మార్కెటింగ్ శాఖ మార్చి నెలాఖరు వరకు లక్ష్యం చేరుకోవాల్సి ఉంది. మరో 13 రోజులు గడిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. ఫిబ్రవరి నాటికే 93 శాతం వరకు ఆదాయం సాధించిన మార్కెట్లు మిగతా 7 శాతం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాయి.

లక్ష్యం రూ.18.3 కోట్లు..

జిల్లాలో బూర్గంపాడు, కొత్తగూడెం, ఇల్లెందు, దమ్మపేట, భద్రాచలం, చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ ఏడాది వీటి నుంచి రూ.18.03 కోట్ల ఆదాయం సాధించాలని మార్కెటింగ్ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెటింగ్ ఫీజు వసూళ్లు చేసేందుకు చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశారు. వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసే వాహనాల నుంచి, వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై మార్కెటింగ్ ఫీజును వసూలు చేస్తారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్ కమిటీల నుంచి రూ.9.76 కోట్ల ఆదాయం సమకూరింది. దీంతో ఈ ఏడాది లక్ష్యాన్ని రూ.18.3 కోట్లకు పెంచారు. మార్కెటింగ్ శాఖ అధికారుల నిరంతర పర్యవేక్షణ, సమన్వయంతో లక్ష్యాలకు చేరువయ్యారు. ఫిబ్రవరి నెలాఖరుకు రూ.16.62 కోట్ల వసూళ్లతో లక్ష్యానికి చేరువైంది. మార్చి నెల 17 రోజుల ఆదాయం కలుపుకుంటే రూ.17 కోట్లు దాటినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెలలో మిర్చి, పత్తి, యాసంగి ధాన్యం, జామాయిల్, సుబాబుల్ క్రయ, విక్రయాలపై వచ్చే మార్కెటింగ్ ఫీజులతో లక్ష్యం అధిగమించే దిశగా జిల్లా మార్కెటింగ్ శాఖ చర్యలు చేపడుతోంది.

ఫిబ్రవరి వరకు వివిధ మార్కెట్ల ద్వారా వచ్చిన ఆదాయం (రూ.కోట్లలో)

మార్కెట్	లక్ష్యం	ఆదాయం
బూర్గంపాడు	5.89	5.40
దమ్మపేట	2.10	1.90
ఇల్లెందు	3.15	3.54
భద్రాచలం	1.67	1.41
కొత్తగూడెం	2.18	2.37
చర్ల	3.04	1.99

నూరుశాతం సాధిస్తాం



ఈ ఏడాది జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్ కమిటీలు నిర్దేశిత ఆదాయ లక్ష్యాలను చేరుకుంటాయి. ఫిబ్రవరి నెలాఖరుకు 93 శాతం లక్ష్యాలను సాధించాం. మిగతా 7 శాతం ఆదాయం సాధించేందుకు కృషి చేస్తున్నాం. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నారు.

–ఎంఏ అలీ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

ఆందోళన ఉద్రిక్తం

తెలంగాణ ఉద్యమకారులను విస్మరించారంటూ పోరాటం

- క్షీణించిన ఆమరణ దీక్ష చేస్తున్న రషీద్ ఆరోగ్యం
- మద్దతుగా రాస్తారోకో, సెల్‌టవర్ ఎక్కి నిరసన
- కలెక్టర్ అనుదీప్ హామీతో దీక్ష విరమణ



ఆమరణ దీక్ష చేస్తున్న రషీద్, ఉద్యమకారులతో చర్చిస్తున్న కలెక్టర్ అనుదీప్

పాల్వంచ: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో అమర వీరుల స్తూపం వద్ద తెలంగాణా ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ రషీద్ ఆమరణ దీక్ష శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. దీక్షకు టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పలువురు కొత్తగూడెం, పాల్వంచ ఉద్యమకారులు సంఘీభావం తెలిపారు. కాగా రషీద్ ఆరోగ్యం క్షీణిస్తుండటంతో వైద్యులు వచ్చి పరీక్షించారు. తహసీల్దార్ రంగా ప్రసాద్, డీఎస్పీ వెంకటేష్, సీఐ నాగరాజు అక్కడికి చేరుకుని దీక్షలను విరమించాలని, సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో రషీద్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలతో తెలంగాణాను సాధించుకుంటే, స్వరాష్ట్రం వచ్చాక ఉద్యమకారులను విస్మరించారని ఆరోపించారు. ఉద్యమకారులకు ఇంటిస్థలాలు ఇవ్వాలని, రుణాలు మంజూరు చేయాలని పింఛన్, అన్‌లిమిటెడ్ హెల్త్ కార్డ్, విద్యార్థుల చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాయంత్రం డీఆర్వో అశోక్ చక్రవర్తి దీక్ష శిబిరం వద్దకు చేరుకుని కలెక్టర్ అనుదీప్‌తో చర్చలకు రావాలని ఆహ్వానించగా.. రషీద్‌తోపాటు ఉద్యమకారులు కలెక్టరేట్‌కు వెళ్లి చర్చలు జరిపారు. సమస్యలను వారంలోగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఉద్యమకారులు శాంతించారు. రషీద్‌కు డీఆర్ఓ అశోక్ చక్రవర్తి, తహసీల్దార్ రంగా ప్రసాద్ నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ఉబ్బన శ్రీను, మంజూరు, మసూద్, దేవదానం, అహ్మద్, చీకటి కార్తీక్, రామకృష్ణ, ఐలయ్య, వైఎస్ఆర్ సీపీ నాయకులు ఖలీల్, మాలమహానాడు సంఘం జాతీయ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి నిరసన

రషీద్ ఆరోగ్యం క్షీణించడంతో దీక్షకు మద్దతుగా అరెవెల్లి పెద్ది, బోగిని సందీప్, ఎస్‌కె.గౌస్, సత్తార్ మున్సిపాలిటీ కార్యాలయం ముందు ఉన్న సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపారు. సీఐ నాగరాజు, ఎస్ఐ ప్రవీణకుమార్ సముదాయించినా కిందకు రాలేదు. కలెక్టర్ హామీతో రషీద్ దీక్ష విరమించినట్లు ప్రకటించాక సెల్ టవర్‌దిగారు. తొలుత రషీద్‌కు మద్దతుగా పలువురు ఉద్యమకారులు బీసీఎం రహదారిపై రాస్తారోకో చేసారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందించారు.



సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న ఉద్యమకారులు

మహిళా సాధికారతతోనే అభివృద్ధి

మిస్ట్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో వక్తలు



మాట్లాడుతున్న డైరెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించనున్న మోటివేషన్ ఇన్నోవేషన్ సపోర్ట్ ట్రెనింగ్ ఫర్ యంగ్ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్స్(ఎంఐఎస్‌టీ-మిస్ట్) రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. మొదట నిర్వహక కార్యదర్శి వి.రజని కార్యక్రమ నివేదికను ప్రవేశపెట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణి ఎడ్యుకేషన్ జీఎం ఎస్.వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ నికోలస్ మాట్లాడుతూ విద్యార్థినులు ఉత్తమ ఎంటర్ ప్రెన్యూర్‌గా ఎదగాలని సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ డీన్ ప్రొఫెసర్ ఎం.గంగాధర్ మాట్లాడుతూ ఒక ఎంటర్ ప్రెన్యూర్ ఆలోచన విజయవంతమైతే వేల సంఖ్యలో ఉద్యోగాలు సృష్టిస్తుందని, దీంతో ఉత్పాదకత పెరుగుతుందని వివరించారు. ఓయూ యూఎఫ్ఆర్‌ఓ డైరెక్టర్ వి. అప్పారావు మాట్లాడుతూ మహిళా సాధికారత ద్వారానే సమాజ, దేశ అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఇంకా కేఎల్ యూనివర్సిటీ కామర్స్ ప్రొఫెసర్ ఏవీఎన్ మూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శారద, కామర్స్ అధ్యాపకులు ఎస్‌వీఎస్ మాణిక్యాంబ, ఆర్.కృష్ణవేణి, ఎం.శైలజ, జి.మంజుల, ఎ.దేవకి, కె.శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో మరో మూడురోజుల పాటు ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ, వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు డీఏఓ కొర్స అభిమన్యుడు, కొత్తగూడెం కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, వాతావరణ విభాగం శాస్త్రవేత్త వింధ్య, పర్యవేక్షకులు సుమన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అకాల వర్షాలతో మొక్కజొన్న, వరి, మిరప, కూరగాయలు, మామిడి రైతులకు నష్టం జరిగే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేడు సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

జూలూరుపాడు: జూలూరుపాడు సహకార సంఘం చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డిపై అవిశ్వాస తీర్మాన సమావేశం శనివారం నిర్వహించనున్నారు. సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరుతూ గత నెల 22న తొమ్మిది మంది డైరెక్టర్లు జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్(డీసీఓ) ఎస్.వెంకటేశ్వరరావుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో డీసీఓ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 11 గంటలకు జరిగే అవిశ్వాస సమావేశానికి హాజరు కావాలని కోరుతూ చైర్మన్‌తో కలిపి 13 మంది డైరెక్టర్లకు సొసైటీ సీఈఓ రమణారెడ్డి నోటీసులు పంపించారు. సహకార సంఘం చైర్మన్ వెంకటరెడ్డి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గూటికి చేయడంతో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ నిర్ణయించింది. కాగా జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా లక్ష్మీదేవి జాతర



సంప్రదాయ కొమ్ము నృత్యం చేస్తున్న గిరిజనులు

గుండాల: జోగ వంశస్తుల ఇలవేల్పు శ్రీ లక్ష్మీదేవత గుడి ప్రవేశంతో తూరుబాక గ్రామంలో శుక్రవారం నిండు జాతర ప్రారంభమైంది. తెల్లవారు జాము నుంచే వడ్డెలు(పూజారులు) లక్ష్మీదేవి, పోతురాజు వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు. తూరుబాక, ముత్తాపురం గ్రామాల్లో జోగు (కట్నాలు, కానుకలు) తీసుకున్నారు. ఊరేగింపు అనంతరం గంగాస్నానం చేయించారు. అమ్మవారిని గుడిలో ప్రతిష్టాపనం చేసి, కుంకుమ పూజలు జరిపారు. గిరిజనుల ఆచార సంప్రదాయాలతో వడ్డెలు, శివ పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. డోలీలతో, కోలాటం ఆడుతూ రాత్రి దేవతా నాట్యప్రదర్శన చేశారు. జోగ రాంబాబు ,అనసూర్య దంపతులు అన్నదానం నిర్వహించారు. జాతర సందర్భంగా గ్రామంలో నిర్వహించి కొమ్ము నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పూజారులు జోగ దమ్మయ్య, జోగ పెద్ద జోగయ్య, రాంబాబు, జోగ బుచ్చయ్య, జోగ చిన నర్సయ్య, సారయ్య, పోతయ్య, సమ్మయ్య, భద్రయ్య, పగడయ్య, కృష్ణ, యదలపల్లి క్రిష్ణ, కల్తి కాంతారావు, పూనెం లక్ష్మయ్య, గొగ్గెల లక్ష్మనారాయణ, గొగ్గెల రామస్వామి, పూనెం లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలుడి ప్రాణం కాపాడిన ప్రభుత్వ వైద్యులు



చికిత్సకు ముందు ఆస్పత్రిలో బాలుడు



చికిత్స అనంతరం కోలుకున్నాక..

భద్రాచలం: ప్రాణాపాయ స్థితిలో ఉన్న గిరిజన బాలుడికి భద్రాచలం ఏరియా ఆస్పత్రి వైద్యులు చికిత్స అందించి ప్రాణం కాపాడారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంట మండలం నిమ్మలగూడేనికి చెందిన ఎడమా రెమా అనే ఎనిమిదేళ్ల బాలుడిని మలేరియా జ్వరంతో విషమ పరిస్థితుల్లో ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే బాలుడి ముఖం, కాళ్లు తీవ్రంగా వాచి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ సుమన్, ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ప్రవీణ్ ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించారు. సుమారు పది రోజుల్లో బాలుడు పూర్తిగా కోలుకున్నాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు వైద్యులకు కృతజ్ఞతలు తెలపగా, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రవిబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ తదితరులు అభినందించారు.

ఆయిల్‌పామ్ సాగు చేయండి



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న అధికారులు

గుండాల: సీజనల్ పంటలతోపాటు అధిక లాభాలనిచ్చే ఆయిల్ పామ్ తోటలను సాగు చేయాలని జిల్లా ఉద్యాన వన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి మరియన్న, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అభిమన్యు సూచించారు. శుక్రవారం ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో వారు ఆయిల్ పాం తోటలను పరిశీలించి మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగు చేస్తే ఎకరాకు రూ. 50వేలకు పైగా రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సాయి నారాయణ, విస్తరణ అధికారులు లెనిన్, శ్రీకన్య, ఉద్యాన అధికారి శాంతి ప్రియ, కార్యాలయ అధికారి విజయ్‌కుమార్, ఆయిల్ ఫెడ్ అధికారులు రాజేశ్వర్‌రెడ్డి, సిద్ధార్థ, బిందు సేద్య ప్రతినిధి రఫీ రైతులు పాల్గొన్నారు.

మోసగాళ్లకు మోసగాళ్లు..

- నకిలీ నోట్ల ఏజెంట్లకు బురిడీ?
- పాల్వంచలో ప్రింటింగ్ జరిగినా బయటకు పొక్కని వైనం
- నిందితుల లింకులపై దృష్టి సారించిన పోలీసులు



ఏపీ పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లు, కంప్యూటర్

పాల్వంచ: పాల్వంచ కేంద్రంగా సాగిన నకిలీ నోట్ల ప్రింటింగ్ వ్యవహారంలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నకిలీ నోట్ల కోసం వచ్చే ఏజెంట్లను కూడా మోసం చేసినట్లు విచారణలో తేలినట్లు తెలుస్తోంది. దొంగ నోట్ల ముఠాను ఆంధ్ర పోలీసులు అరెస్ట్ చేసిన విదితమే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, వీఆర్‌పురం మండలాల్లో నకిలీ కరెన్సీ నోట్లను చలామణి చేస్తున్న ఘటనలో పాల్వంచకు చెందిన పాదిలి మురళి, జంగం శ్రీనివాస్, కటారి సామ్రాజ్యం , గొడుగొల్ల కిరణ్‌కుమార్, అశ్వారావుపేట అచ్చుతాపురానికి చెందిన పాకనాటి నాగేశ్వరరావు, సత్తుపల్లికి చెందిన కొనకాళ్ల చిట్టిబాబు, రంగారెడ్డి జిల్లా ఉప్పల్‌కు చెందిన పసుపులేటి ఉమేశ్ చంద్ర, ఆంధ్ర ప్రదేశ్ పల్నాడు జిల్లా దుర్గికి చెందిన పాదిలి శ్రీనివాస్, మాచర్లకు చెందిన వేముల పుల్లారావు ఉన్నట్లు అక్కడి పోలీసులు ప్రకటించారు. వారిని విచారించగా పలు విషయాలు వెల్లడైనట్లు సమాచారం.

పథకం ప్రకారం మార్పిడి...

ముఠా సభ్యులు పథకం ప్రకారం నకిలీ నోట్లను చలామణి చేసినట్లు తెలుస్తోంది. దొంగ నోట్లను రద్దీ ప్రదేశాల్లో, రాత్రి వేళల్లో మార్చినట్లు సమాచారం. దీంతోపాటు నకిలీ నోట్ల కోసం సంప్రదించిన ఏజెంట్లను కూడా బురిడీ కొట్టించినట్లు తెలుస్తోంది. నకిలీ నోట్లకు బదులు, నల్లటి పేపర్ కట్టలు ఇచ్చి, ఓ రసాయన ద్రావణంలో ముంచితే నకిలీ నోటుగా మారుతుందని నమ్మించి మోసం చేసినట్లు సమాచారం. ఒక ఒరిజినల్ నోటును ముందుగానే నలుపు రంగులోకి మార్చి, వారి ముందు రసాయన ద్రావణంలో ముంచి మళ్లీ ఒరిజినల్ నోటుగా మారేలా చేసి నమ్మించి, నల్లటి పేపర్ కట్టలను ఏజెంట్లకు అంటగట్టినట్లు తెలుస్తోంది. సినిమా షూటింగ్ కోసం ముద్రించిన రూ.500 బొమ్మనోట్లను కూడా అసలు నోట్లుగా చలామణి చేసినట్లు సమాచారం.

ఏపీ పోలీసులకు చిక్కేవరకు..

ముఠా నుంచి ఏపీ పోలీసులు రూ. 45 లక్షల విలువైన నకిలీ నోట్లను, ఒక కంప్యూటర్, రెండు ప్రింటర్లు, లామినేషన్ మిషన్, ఆటో, రూ.500 నోట్ల సైజులో కటింగ్ చేసిన బ్లాక్ కలర్ బండిల్స్, వైట్ పేపర్ బండిల్స్, కటింగ్ బ్లేడ్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ నకిలీ నోట్లను పాల్వంచలోని పాదిలి మురళి ఇంటి వద్ద ముద్రించినా ఆంధ్రా పోలీసులకు చిక్కేవరకు ఎక్కడా బయటకు పొక్కకపోవడం గమనార్హం. కాగా ముఠా సభ్యులు రూ.25 లక్షల నకిలీ నోట్లను కాల్చివేసినట్లు సమాచారం. నిందితులతో మరికొందరికి లింకులు ఉన్నాయని, ఆ కోణంలో ఇంకా విచారణ సాగుతోందని ఏపీ పోలీసులు ప్రకటించారు.

వివాహ వేళ విషాదం

గుండెపోటుతో వధువు తండ్రి మృతి



చింతేటి అర్జున్ (ఫైల్)

కూసుమంచి: ఇంకో రోజు గడిస్తే కుమార్తె పెళ్లి జరగనుంది.. పెళ్లి కుమార్తెగా అలకరించడంతో ఇతర ఏర్పాట్లు చురుగ్గా సాగుతుండగా వధువు తండ్రి గుండెపోటుతో మృతి చెందిన విషాద ఘటన ఇది. కూసుమంచికి చెందిన వీఆర్వో(సర్దుబాటులో వైద్యశాఖలో పనిచేస్తున్నాడు) చింతేటి అర్జున్(55) కుమార్తె వివాహం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు ఎస్ మండలం ఏపూరుకు చెందిన యువకుడితో నిశ్చమైంది. ఈమేరకు శనివారం ఉదయం ఖమ్మం రూరల్ మండలంలోని మారెమ్మగుడి వద్ద పెళ్లికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం వరకు అర్జున్ ఇంటికి బంధువులు చేరుకోగా, కుమార్తెను అలకరించడంతో పాటు ఇతర పనుల్లో నిమగ్నమయ్యాడు. ఇంతలోనే రాత్రి ఆయనకు ఛాతినొప్పి రాగా గుండెపోటుగా భావించి కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. దీంతో శుక్రవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించగా, పెళ్లి జరగాల్సిన ఇంట కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

సాక్షి బిజినెస్

శనివారం
18-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
	355	114
	57,990	17,100

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,650	▽	66
డోజోన్స్	31,923	▽	323
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,335	▽	75
డాక్స్	14,768	▽	199
షాంఘై	3,251	▲	24
నికాయ్	27,334	▲	323

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై			
బంగారం (24 క్యారెట్)	58,882	▽	121
బంగారం (22 క్యారెట్)	58,646	▽	120
వెండి (కిలో)	71,576	▽	523

బిస్లెరీతో చర్చలకు 'టాటా'

వ్యాపార విస్తరణపై దృష్టి కొనసాగింపు



న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో చేపట్టిన చర్చలకు చెక్ పడినట్లు ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్(టీసీపీఎల్) తాజాగా వెల్లడించింది. ఇటీవల కొద్ది రోజులుగా బిస్లెరీ బ్రాండును టాటా గ్రూప్ కొనుగోలు చేయనున్నట్లు అంచనాలు పెరిగిన నేపథ్యంలో చర్చలు నిలిపివేసినట్లు నియంత్రణ సంస్థలకు టాటా కన్జూమర్ తెలియజేసింది. ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో ఎలాంటి తప్పనిసరి ఒప్పందాలు కుదుర్చుకోలేదని స్పష్టం చేసింది. ఇందుకు ఎలాంటి కట్టుబాట్లనూ ఏర్పాటు చేసుకోలేదని తెలియజేసింది. అయితే వ్యాపార విస్తరణ, వృద్ధి అవకాశాలకున్న వ్యూహాత్మక అంశాలపై దృష్టి కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఇకపైనా బిస్లెరీ ఇంటర్నేషనల్ సహా వివిధ సంస్థలతో చర్చలు నిర్వహించే వీలున్నట్లు వెల్లడించింది. కాగా.. బిస్లెరీ ఇంటర్నేషనల్ విక్రయానికి టీసీపీఎల్‌తోపాటు పలు కొనుగోలుదారులతో చర్చలు నిర్వహిస్తున్నట్లు ప్రమోటర్, వెనుకటితరం పారిశ్రామికవేత్త రమేష్ చౌహాన్ గతేడాది పేర్కొన్నారు. మరోవైపు మరిన్ని మార్కెట్లలో విస్తరించేందుకు అనువుగా టీసీపీఎల్ పలు కంపెనీలను కొనుగోలు చేస్తూ వస్తోంది. టీసీపీఎల్‌కు ఇప్పటికే హిమాలయన్ బ్రాండుతో బాటిల్డ్ వాటర్ విభాగంలో కార్యకలాపాలు ఉన్నాయి.

తాజా వివరణ నేపథ్యంలో టీసీపీఎల్ షేరు 2 శాతం బలపడి రూ. 708 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-2-2023	
విశాఖ	450-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438-00
విజయవాడ	438-00
రిటైల్ ధర (డజను)	66.00
17-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.95

మా ఉత్పత్తులకు హబ్‌గా శ్రీసిటీ

- ఈసారి బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యం
- బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రాబోయే రోజుల్లో తమ ఉత్పత్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ హబ్‌గా మారగలదని ఎయిర్ కండీషనింగ్, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ ఎండీ బి. త్యాగరాజన్ చెప్పారు. ఇప్పటికే అక్కడ ఇన్వెస్ట్ చేసినవి, కొత్తగా చేయబోయేవి కలిపి రాబోయే మూడేళ్లలో మొత్తం రూ. 1,000 కోట్ల పైచిలుకు పెట్టుబడి పెట్టినట్లవుతుందని త్యాగరాజన్ వివరించారు. వ్యూహాత్మక స్థానంలో ఉన్నందున సరుకు రవాణా, నిల్వ చేసుకోవడం వంటి విషయాలకు సంబంధించి తమకు ఇది ప్రయోజనకరంగా ఉంటోందని పేర్కొన్నారు. శుక్రవారమిక్కడ కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించిన సందర్భంగా త్యాగరాజన్ ఈ విషయాలు చెప్పారు. శ్రీసిటీలో రూమ్ ఏసీల తయారీకి సంబంధించి మొత్తం నాలుగు దశల్లో ప్రస్తుతం తొలి దశ పూర్తయి ఇటీవలే ఉత్పత్తి మొదలైందని చెప్పారు. మిగతావి కూడా పూర్తయితే 12 లక్షల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అటు కమర్షియల్ ఏసీల తయారీకి సంబంధించి రెండో ప్లాంటు నిర్మాణం కోసం 40 ఎకరాలు సమీకరించినట్లు, 2024లో పనులు, 2025లో ఉత్పత్తి ప్రారంభం కాగలదని అంచనా వేస్తున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. గత కొద్ది త్రైమాసికాలుగా సానుకూల ఫలితాలు నమోదు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బిలియన్ డాలర్ల ఆదాయం (దాదాపు రూ. 8,200 కోట్లు) అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ. 6,046 కోట్ల ఆదాయం నమోదు చేసింది.



బ్లూస్టార్ కొత్త ఉత్పత్తుల శ్రేణి ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్ రెడ్డి (ఎడమ), ఎండీ బి. త్యాగరాజన్

అంతర్జాతీయంగా విస్తరణ..: కొత్త విభాగాల్లో ప్రవేశించడం కన్నా ఇతర దేశాల్లో మరింత విస్తరించడంపై దృష్టి పెడుతున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. ప్రస్తుతం మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేస్తుండగా అమెరికా, యూరప్ తదితర మార్కెట్లలోనూ కార్యకలాపాలకు సిద్ధమవుతున్నట్లు వివరించారు. ఆయా మార్కెట్లకు ఈ ఏడాది ఆఖరు నుంచే ఎగుమతులు మొదలుపెట్టే అవకాశం ఉందన్నారు.

కొత్త ఫ్రీజర్ల శ్రేణి..

బ్లూస్టార్ ఆవిష్కరించిన కొత్త ఉత్పత్తుల శ్రేణిలో దేశీయంగా తీర్చిదిద్దిన డీప్ ఫ్రీజర్లు, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తులు ఉన్నాయి. వీటి కూలింగ్, నిల్వ సామర్థ్యాలు మరింత అధికంగా ఉంటాయని, వీటిని మహారాష్ట్రలోని వాడా ప్లాంటులో తయారు చేశామని త్యాగరాజన్ తెలిపారు. రాబోయే రోజుల్లో తమ సంస్థ వృద్ధికి కమర్షియల్ రిఫ్రిజిరేషన్ మరింతగా ఊతమివ్వగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఈ విభాగం నుంచి తమకు రూ. 70 కోట్లు, దక్షిణాదిలో రూ. 235 కోట్ల పైచిలుకు ఆదాయం వస్తోందన్నారు. మొత్తం అన్ని విభాగాల రీత్యా చూస్తే తమ సంస్థ 20–25 శాతం వృద్ధి సాధిస్తోందని, పరిశ్రమ వృద్ధి సుమారు 15–20 శాతం మేర ఉంటోందని పేర్కొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం విలీనానికి ఓకే

ఎన్‌సీఎల్‌టీ అనుమతి

న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ రంగ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీనానికి జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో దేశంలోనే అతిపెద్ద మార్టిగేజ్ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనంకానుంది. వెరసి దేశీ కార్పొరేట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద విలీనంగా నమోదుకానుంది. ఇందుకు ఇప్పటికే నియంత్రణ సంస్థలు ఆర్‌బీఐ, సెబీ, పీఎఫ్‌ఆర్‌డీఏ, సీసీఐ అనుమతించాయి. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ సైతం ఓకే చెప్పాయి. ఈ బాటలో రెండు సంస్థల వాటాదారుల నుంచి అనుమతి కోరేందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం క్యూ3 నాటికి విలీనం పూర్తికావచ్చని అంచనా.

ట్యూబులర్ బిడ్‌కు గ్రీన్‌సిగ్నల్

రుణ సంక్షోభంలో చిక్కుకున్న సింటెక్స్ కొనుగోలుకి ప్రాపెల్ ప్లాస్టిక్ ప్రొడక్ట్స్, ప్లాస్టాటో (ట్యూబులర్ పైప్స్) కన్సార్షియం వేసిన బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బిడ్ విలువ రూ. 1,250 కోట్లుగా సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

సరికొత్త ఫీచర్లతో పల్సర్ ఎన్‌ఎస్ సిరీస్

హైదరాబాద్: బజాజ్ ఆటో తన పల్సర్ ఎన్‌ఎస్ నేకెడ్ స్ట్రీట్‌ఫైటర్ లైన్‌కు అప్‌డేట్ వెర్షన్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లోని ఎన్‌ఎస్ 160, ఎన్‌ఎస్ 200 మోడళ్లను సరికొత్త ఫీచర్లతో తీసుకొచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.1.35 లక్షలు.., రూ.1.47 లక్షలుగా ఉన్నాయి. మంచి హ్యాండ్లింగ్ కోసం యూఎస్‌డీ ఫ్రంట్ ఫోర్క్‌లు, మెరుగైన భద్రతకు డ్యూయల్ చానల్ ఏబీఎస్‌ను అమర్చారు. ఇన్ఫినిటీ డిస్‌ప్లే కొత్త పల్సర్లలో ప్రత్యేకం. డిస్‌ప్లే కన్సోల్‌లో ఇప్పుడు గేర్ పొజిషన్ ఇండికేటర్ కూడా ఉంది. ఎన్‌ఎస్ 200 మోడల్ 18.75 ఎన్‌ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6–స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్‌తో జత చేశారు. ఎన్‌ఎస్ 160 మోడల్ 14.6 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇంజిన్ 5–స్పీడ్ గేర్‌బాక్స్‌తో వస్తుంది.



బిగ్‌'సి' ఉగాది ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ విక్రయ సంస్థ 'బిగ్‌సి' ఉగాది పండుగ సందర్భంగా వినూత్న ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై ఆకర్షణీయ రాయితీలు అందిస్తున్నట్లు కంపెనీ సీఎండీ యం.బాలు చౌదరి తెలిపారు. స్మార్ట్ ఫోన్ల కొనుగోలుపై పదిశాతం వరకు క్యాష్ బ్యాక్‌తో పాటు ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా సులభ ఈఎంఐలలో పొందొచ్చన్నారు. స్మార్ట్ టీవీల కొనుగోలుపై 1,500 వరకు క్యాష్ బ్యాక్ ఇస్తుందన్నారు. సులభ ఈఎంఐ పద్ధతిలో ల్యాప్‌టాప్స్ కొనే సౌకర్యం కూడా ఉందన్నారు. ''ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుంది. మా రిటైల్ స్టోర్లలో ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలకే ఉత్పత్తులు లభిస్తాయి. ప్రజలంతా ఈ ఆఫర్లను వినియోగించుకోవాలి'' అని బాలు చౌదరి కోరారు.



ఫోన్‌పే రూ. 1,650 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే కొత్తగా 200 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,650 కోట్లు) సమీకరించింది. 12 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ప్రధాన వాటాదారు వాల్‌మార్ట్ ఈ మేరకు నిధులు సమకూర్చింది. సింగపూర్ నుంచి భారత్‌కు కార్యాలయాన్ని మార్చుకున్న నేపథ్యంలో ఫోన్‌పే 1 బిలియన్ డాలర్ల వరకూ మూలధనాన్ని సేకరించే ప్రయత్నాల్లో ఉంది. తాజాగా అందిన నిధులతో ఇప్పటివరకూ 650 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 5,360 కోట్లు) సమీకరించినట్లవుతుంది. మిగతా పెట్టుబడులను కూడా త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ఈ నిధులను బీమా, వెల్త్ మేనేజ్‌మెంట్, రుణాలు, స్టాక్ బ్రోకింగ్ మొదలైన వ్యాపార విభాగాల వృద్ధికి ఉపయోగించుకోనుంది. గూగుల్ పే, పేటీఎంలతో ఫోన్‌పే పోటీపడుతోంది.



ఒడిదుడుకులున్నా... లాభాలే!

- 17,100 వద్ద నిఫ్టీ ముగింపు
- సెన్సెక్స్ లాభం 355 పాయింట్లు
- రెండో రోజూ ముందడుగు

ముంబై: ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు శుక్రవారం లాభాలు గడించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో రికవరీ ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. క్రూడ్ ధరలు దిగిరావడం, రూపాయి బలపడటం కలిసొచ్చాయి. మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. ఉదయం సెన్సెక్స్ 403 పాయింట్లు బలపడి 58,038 వద్ద, నిఫ్టీ 126 పాయింట్లు పెరిగి 17,112 వద్ద మొదలయ్యాయి. భారీ లాభాల ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు తొలి దశలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సూచీలు మిడ్‌సెషన్ కల్లా ఆరంభ లాభాలను కోల్పోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 131 పాయింట్లు నష్టపోయి 57,504 వద్ద, నిఫ్టీ 28 పాయింట్లు పతనమై 16,958 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. ద్వితీయార్థంలో కనిష్టస్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరి వరకు అదే జోరు కొనసాగడంతో సెన్సెక్స్ 355 పాయింట్లు బలపడి 57,990 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114 పాయింట్లు పెరిగి 17,100 వద్ద నిలిచింది. విస్తృత స్థాయి మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అర శాతం చొప్పున పెరిగాయి. ఆటో, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌పీఐలు రూ.1817 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1767 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 82.65 స్థాయి వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు 1% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.5% నష్టపోయాయి. యూఎస్ స్టాక్ సూచీలు ఒకశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- బ్లాక్ డీల్ ద్వారా భారీ సంఖ్యలో షేర్లు మారడంతో బయోకాన్ షేరు 9% నష్టపోయి రూ.202 వద్ద స్థిరపడింది.
- రియల్టీ రంగ సంస్థ డీఎల్‌ఎఫ్ షేరు నాలుగుశాతానికి పైగా లాభపడి రూ 375 వద్ద స్థిరపడింది. అతి తక్కువ సమయంలో రికార్డు స్థాయిలో రూ.8,000 కోట్ల విలువైన లగ్జరీ ఫ్లాట్లను విక్రయించడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో ఐదు శాతం పెరిగి రూ.377.50 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- కేంద్రం రూ.70,500 కోట్ల రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లకు అనుమతినివ్వడంతో హిందూస్థాన్ ఏరోనాటిక్స్ షేరు మూడుశాతం లాభపడి రూ.2,780 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్

ఉత్తమ ఆటగాళ్లుగా సవితా పూనియా, హార్దిక్ సింగ్

భారత హాకీ సమాఖ్య (హెచ్‌ఐ) 2022 సంవత్సరానికిగాను భారత జట్టుకు సంబంధించి వార్షిక అవార్డులను ప్రకటించింది. పురుషుల విభాగంలో మిడ్‌ఫీల్డర్ హార్దిక్ సింగ్, మహిళల విభాగంలో సవితా పూనియా హాకీ ఇండియా ఉత్తమ ఆటగాళ్లుగా నిలిచారు. ఒడిశాలో జరిగిన హాకీ ప్రపంచకప్‌లో హార్దిక్ అద్భుత ఆటతీరు కనబర్చాడు. ఎఫ్‌ఐహెచ్ ఉమెన్స్ నేషనల్ కప్ టైటిల్ గెలిపించి ప్రొ లీగ్‌కు భారత జట్టు అర్హత సాధించడంలో కీపర్‌గా, కెప్టెన్‌గా సవిత కీలక పాత్ర పోషించింది. ఇద్దరికీ హాకీ ఇండియా తరఫున రూ. 25 లక్షల చొప్పున నగదు పురస్కారం లభించింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. దీంతో పాటు 2021కు సంబంధించిన అవార్డులను కూడా ప్రకటించగా హర్మన్‌ప్రీత్, సవితా పూనియా అత్యుత్తమ ఆటగాళ్లుగా అవార్డులు అందుకున్నారు. 2022లో సుల్తాన్ జొహర్ కప్ గెలిచిన భారత జూనియర్ జట్టును కూడా ఈ సందర్భంగా సత్కరించారు.



రాహుల్, జడేజా గెలిపించగా...



రాహుల్

- తొలి వన్డే భారత్‌దే
- 5 వికెట్లతో ఓడిన ఆస్ట్రేలియా
- రాణించిన షమీ, సిరాజ్
- ఆదివారం విశాఖపట్నంలో రెండో వన్డే

తొలి వన్డేలో భారత్ విజయలక్ష్యం 189 పరుగులే...దీనిని చూస్తే ఛేదన చాలా సులువనిపించింది. కానీ ఒక దశలో స్కోరు 16/3 కాగా, ఆపై 39/4కు మారింది...ప్రతికూలంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు శ్రమించాల్సి వచ్చింది. చివరకు రాహుల్, జడేజా శతక భాగస్వామ్యం జట్టును విజయం దిశగా నడిపించింది. ఎనిమిది నెలల తర్వాత ఆడిన తొలి వన్డేలో జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శన నమోదు చేయగా, టెస్టుల్లో బ్యాటింగ్‌పై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న రాహుల్ వన్డేల్లో తానేంటో చూపించాడు. అంతకు ముందు భారత బౌలర్లు ఆసీస్‌ను కట్టి పడేశారు. మిచెల్ మార్ష్ మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన జట్టు భారీ స్కోరు చేసేందుకు సరిపోలేదు.

ముంబై: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 35.4 ఓవర్లలో 188 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ మార్ష్ (65 బంతుల్లో 81; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. అనంతరం భారత్ 39.5 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (91 బంతుల్లో 75 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (69 బంతుల్లో 45 నాటౌట్; 5 ఫోర్లు) ఆరో వికెట్‌కు అభేద్యంగా 108 పరుగులు జత చేశారు. 2 వికెట్లు, 1 కీలక క్యాచ్‌తో పాటు బ్యాటింగ్‌లో రాణించిన జడేజా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలవగా... ఈ నెల 19న వైజాగ్‌లో రెండో వన్డే జరుగుతుంది.

మార్ష్ మినహా...

తన తొలి ఓవర్లోనే ట్రవిస్ హెడ్ (5)ను సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియాకు సరైన ఆరంభం లభించలేదు. అయితే మార్ష్ దూకుడుగా ఆడి జట్టును నడిపించాడు. సిరాజ్ తర్వాతి ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన మార్ష్, సిరాజ్ మరో ఓవర్లోనే రెండు ఫోర్లు బాదాడు. 10 ఓవర్లు ముగిసేసరికి ఆసీస్ స్కోరు 59 పరుగులకు చేరింది. మార్ష్‌కు సహకరించిన స్టీవ్ స్మిత్ (22)ను కీపర్ రాహుల్ చక్కటి క్యాచ్‌తో వెనక్కి పంపడంతో 72 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. మార్ష్ 51 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కుల్దీప్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి అతను తన జోరును కొనసాగించాడు. అయితే జడేజా బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన మార్ష్ షార్ట్ థర్డ్‌మాన్ వద్ద సిరాజ్‌కు క్యాచ్ ఇచ్చాడు. మార్ష్, లబుషేన్ (15) మూడో వికెట్‌కు 52 పరుగులు జత చేశారు. అంతే...ఆ తర్వాత ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. 20వ ఓవర్లో 129/2తో మెరుగైన స్థితిలో నిలిచిన ఆ జట్టు 36వ ఓవర్ కూడా ముగియక ముందే ముగిసింది. 59 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి 8 వికెట్లు కోల్పోయింది. తన చివరి 14 బంతుల్లో షమీ ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 3 వికెట్లు పడగొట్టగా...సిరాజ్ తన చివరి 10 బంతుల్లో ఒక్క పరుగూ ఇవ్వకుండా 2 వికెట్లు తీశాడు.



మార్ష్

శతక భాగస్వామ్యం...

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఆరంభంలో భారత్ తడబడింది. ఇషాన్ కిషన్ (3) తనకు లభించిన అరుదైన అవకాశాన్ని వృథా చేసుకోగా... స్టార్క్ వరుస బంతుల్లో కోహ్లి (4), సూర్యకుమార్ (0)లను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి భారత శిబిరంలో ఆందోళన పెంచాడు. వ్యక్తిగత స్కోర్ల 2, 7 వద్ద ఇన్‌గ్లిస్, స్మిత్ క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన శుబ్‌మన్ గిల్ (20) దానిని ఉపయోగించుకోలేకపోయాడు. ఈ దశలో రాహుల్, హార్దిక్ పాండ్యా (25) కలిసి జట్టును ఆదుకున్నారు. అయితే స్టొయినిస్ బౌన్సర్‌తో పాండ్యాను అవుట్ చేయడంతో 44 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. విజయానికి మరో 106 పరుగులు చేయాల్సిన ఇలాంటి స్థితిలో ఆస్ట్రేలియాదే పైచేయిగా మారినట్లు అనిపించింది. కానీ రాహుల్, జడేజా జోడి ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వలేదు. చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ వీరిద్దరు పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 73 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఈ జోడీని విడదీసేందుకు ఆసీస్ బౌలర్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది.

స్కోరు వివరాలు:

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) సిరాజ్ 5; మార్ష్ (సి) సిరాజ్ (బి) జడేజా 81; స్మిత్ (సి) రాహుల్ (బి) పాండ్యా 22; లబుషేన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 15; ఇన్‌గ్లిస్ (బి) షమీ 26; గ్రీన్ (బి) షమీ 12; మ్యాక్స్‌వెల్ (సి) పాండ్యా (బి) జడేజా 8; స్టొయినిస్ (సి) గిల్ (బి) షమీ 5; అబాట్ (సి) గిల్ (బి) సిరాజ్ 0; స్టార్క్ (నాటౌట్) 4; జంపా (సి) రాహుల్ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (35.4 ఓవర్లలో ఆలౌట్) 188.**

వికెట్ల పతనం: 1-5, 2-77, 3-129, 4-139, 5-169, 6-174, 7-184, 8-184, 9-188, 10-188. **బౌలింగ్:** షమీ 6-2-17-3, సిరాజ్ 5.4-1-29-3, పాండ్యా 5-0-29-1, శార్దుల్ 2-0-12-0, జడేజా 9-0-46-2, కుల్దీప్ 8-1-48-1.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (ఎల్బీ) (బి) స్టొయినిస్ 3; గిల్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 20; కోహ్లి (ఎల్బీ) (బి) స్టార్క్ 4; సూర్యకుమార్ (ఎల్బీ) (బి) స్టార్క్ 0; రాహుల్ (నాటౌట్) 75; పాండ్యా (సి) గ్రీన్ (బి) స్టొయినిస్ 25; జడేజా (నాటౌట్) 45; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (39.5 ఓవర్లలో 5 వికెట్లకు) 191. వికెట్ల పతనం:** 1-5, 2-16, 3-16, 4-39, 5-83. **బౌలింగ్:** స్టార్క్ 9.5-0- 49-3, స్టొయినిస్ 7-1-27-2, అబాట్ 9-0-31-0, గ్రీన్ 6-0-35-0, జంపా 6-0-37-0, మ్యాక్స్‌వెల్ 2-0-7-0.



గాయత్రి-ట్రెసా జోరు

- సెమీఫైనల్లో భారత జోడి
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 1000 టోర్నీ ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్ – ట్రెసా జాలీ దూకుడు కొనసాగుతోంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి – ట్రెసా జంట వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భారత ద్వయం 21–14, 18–21, 21–12 స్కోరుతో లీ వెన్ మీ – ల్యూ వాన్ వాన్ (చైనా)పై విజయం సాధించింది. 64 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో ప్రపంచ 17వ ర్యాంక్ జోడి గాయత్రి – ట్రెసా అటు అటాకింగ్, ఇటు డిఫెన్స్‌లో చెలరేగింది. గత ఏడాది కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం సాధించినప్పటినుంచి వరుస విజయాలతో సత్తా చాటుతున్న భారత జంట అదే జోరును ఇక్కడా ప్రదర్శించింది. తొలి గేమ్‌ను ధాటిగా ప్రారంభించిన గాయత్రి – ట్రెసా 6–2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. అయితే చైనా జంట 6–6తో స్కోరును సమం చేసింది. ఈ దశలో మళ్లీ చెలరేగిన భారత జోడి ముందుగా 11–8తో ఆధిక్యం ప్రదర్శించి ఆ తర్వాత వరుస పాయింట్లతో 18–12కు దూసుకెళ్లి ఆపై గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం భారత జంటకు గట్టి పోటీ ఎదురైంది. ఏ దశలోనూ ఆధిక్యం అందుకోలేకపోయిన గాయత్రి – ట్రెసా గేమ్‌ను కోల్పోయారు. చివరి గేమ్‌లో మాత్రం మన జట్టుదే హవా నడిచింది. వరుసగా ఆరు పాయింట్లతో 8–1తో ముందంజ వేసిన అనంతరం స్కోరు 11–4..13–5..15–8..18–10...ఇలా సాగింది. 20–12 వద్ద గాయత్రి కొట్టిన ఫోర్‌హ్యాండ్ స్మాష్‌తో భారత జంట విజయం ఖాయమైంది. సెమీ ఫైనల్లో కొరియాకు చెందిన బేక్ హ నా – లీ సా హితో గాయత్రి – ట్రెసా తలపడతారు.



జాస్మిన్, శశి ముందంజ

వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్లు జాస్మిన్ లంబోరియా, శశి చోప్రా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి పోరులో జాస్మిన్ (60 కేజీల విభాగం) రిఫరీ స్టాపింగ్ ద కాంటెస్ట్ (ఆర్‌ఎస్‌సీ) ద్వారా ఎన్‌యాంబెగా ఆంబ్రోస్ (టాంజానియా)ను చిత్తు చేసింది. బౌట్ మొదలైన 12 సెకన్లలోనే జాస్మిన్ విసిరిన పంచ్‌లకు ఆంబ్రోస్ తట్టుకోలేకపోవడంతో రిఫరీ ఆటను ఆపివేసి జాస్మిన్‌ను విజేతగా ప్రకటించారు. 63 కేజీల కేటగిరీలో శశి చోప్రా 5–0 స్కోరుతో ఎంవాంగి టెరిసియా (కెన్యా)పై ఘన విజయం సాధించింది. తర్వాతి రౌండ్‌లో సమడోవా (తజికిస్తాన్)తో జాస్మిన్... కిటో మై (జపాన్)తో శశి తలపడతారు. అయితే 70 కేజీల విభాగంలో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత బాక్సర్ శ్రుతి యాదవ్ 0–5తో జో పాన్ (చైనా) చేతిలో ఓటమిపాలైంది. నేడు భారత బాక్సర్లు నీతూ ఘంఘాస్, మంజు బంబోరియా తొలి రౌండ్‌లో ఆడతారు.



ఐర్లాండ్‌తో భారత్ టి20 సిరీస్

డబ్లిన్: ఈ ఏడాది ఆగస్టులో భారత్‌తో టి20 సిరీస్‌కు ఐర్లాండ్ బోర్డు ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 18 నుంచి 23 వరకు జరిగే ఈ సిరీస్‌లో ఇరు జట్ల మధ్య మూడు టి20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అయితే మరి కొద్ది రోజుల తర్వాత స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ ఉన్న నేపథ్యంలో భారత్ కోణంలో ఈ టి20 సిరీస్‌కు ప్రాధాన్యత లేదు కాబట్టి ద్వితీయ శ్రేణి జట్టు పాల్గొనే అవకాశం ఉంది.

న్యూజిలాండ్ 155/2

వెల్లింగ్టన్: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (108 బంతుల్లో 78; 13 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. వర్షం, వెలుతురులేమి కారణంగా శుక్రవారం 48 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

'కెంట్' తరఫున అర్ష్‌దీప్ సింగ్

కెంట్: భారత లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ దీప్ సింగ్ వచ్చే సీజన్‌లో ఐదు మ్యాచ్‌లలో 'కెంట్' కౌంటీకి ప్రాతినిధ్యం వహిస్తాడు. అర్ష్‌దీప్ భారత్ తరఫున 3 వన్డేలు, 26 టి20ల్లో ఆడాడు. భవిష్యత్తులో భారత టెస్టు జట్టులో అవకాశాల కోసం ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడమని, కౌంటీలు ఆడితే ప్రదర్శన మెరుగవుతుందని కోచ్ ద్రవిడ్ చేసిన సూచనతో అతను కౌంటీ క్రికెట్ వైపు వెళుతున్నాడు.